ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతుల తరలించిన ధాన్యానికి సకాలంలో బిల్లులు చెల్లిచాలి : ఆర్డీవో రామ్మోహన్రావు

విశాలాంధ్ర-బొబ్బిలి : రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యానికి సకాలంలో బిల్లులు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని, మిల్లుల యాజమాన్యాలు ధాన్యం కొనుగోలు కేంద్రం నుండి వచ్చిన వాహనాలను వెంటనే అన్లోడింగ్ అయ్యే విధంగా చూడాలని రెవెన్యూ డివిజనల్ అధికారి రామ్మోహన్ రావు తహశీల్దార్ ఎం శ్రీను, సివిల్ సప్లై ఉప తహశీల్దార్ రెడ్డి సాయి కృష్ణ కుమార్ లను ఆదేశించారు. గురువారం మండల పరిధిలో పలు రైస్ మిల్లులను రవీందర్ డివిజనల్ అధికారి రామ్మోహన్ రావు, తహశీల్దార్ ఎం శ్రీను పరిశీలన చేసి మిల్లులు యజమానులకు సూచనలు జారీ చేశారు.

విద్యార్థులు రాజకీయాలకు రావాలి, నాయకులుగా ఎదగాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: దేశాన్ని కాపాడాలంటే విద్యార్థులంతా రాజకీయాల్లోకి వచ్చి.. నాయకులుగా ఎదగాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. ఎఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలలో రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు అధ్యక్షతన రెండవ రోజు గురువారం జరిగిన ప్రతినిధుల సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థికి చదువుతోపాటు సమాజంలోని మంచిచెడ్డలు, రాజకీయాలు పూర్తిగా తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నేడు స్కాంలు చేసేవారు, లంచగొండులు, అవినీతి పరులు, దుర్మార్గులు దేశాన్ని నాశనం చేస్తుంటే యువతరం రాజకీయాల్లోకి వచ్చి నిజాయితీ కలిగిన నేతలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం రాకముందునుంచి ఎఐఎస్ఎఫ్. ఉద్యమాలలో పాల్గొనడం జరిగిందన్నారు. నాడు ఎఐఎస్ఎఫ్ పనిచేసిన అనేకమంది నేడు రాష్ట్ర, దేశం స్థాయిలలో అనేక పదవులు చేపట్టారని గుర్తుచేసారు. వారిలో అటల్ బిహారీ వాజ్పేయి, ఐ.కె. గుజ్రాల్ వంటి వారిని ప్రస్తుతించారు. నేడు స్వాతంత్ర్య ఉద్యమమంలో పాల్గొనని, అనర్హులైన వారు ప్రభుత్వాల పాలన చేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం దేశం ప్రమాదకర పరిస్థితిలో ఉందని, విద్యార్థులు ఈ విషయం గమనించాలన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్నే పూర్తిగా రూపుమాపు చేయాలని మతోన్మాద శక్తులు ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. కేవలం హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టి కులాల మధ్య, మతాల మధ్య చిచ్చు రేపుతున్నారని అన్నారు. దేశంలో ఆర్ఎస్ఎస్ నియంతృత్వ పాలన సాగుతోందన్నారు. దేశంలో 18 కోట్లు మంది ముస్లింలు ఉన్నారని, కానీ బీజెపీ ప్రభుత్వంలో ఒక్క ముస్లింకు ఎంపి టిక్కెట్ ఇవ్వలేదని, అలాగే మంత్రివర్గంలో ఒక్కరిని కూడా మంత్రిగా చేయలేదన్నారు. దేశంలో ఎక్కడైనా, ఎప్పుడైనా విద్యార్థిలకు అన్యాయం జరిగిందంటే ముందుగా పోరాటం చేసేది కేవలం ఎఐఎస్ఎఫ్ మాత్రమేనని తెలిపారు. అలాగేఒకవైపు పవన్ కళ్యాణ్ సనాతన ధర్మమంటుంటే, మరోవైపు పూర్తిగా బట్టలూడదీసుకుని తిరుగుతున్న ఓఅఘోరా కూడా సనాతన ధర్మం పేరు చెప్పుకోవడం ప్రజలకు ఆశ్చర్యానికి గురిచేస్తుందన్నారు. చంద్రబాబు అధికారం రాకముందు బాగానే ఉన్నా, అధికారం చేపట్టాక ఆయన తీరు మారి విచిత్రంగా ప్రవర్తిస్తారన్నారు. రాష్ట్రంలోని అన్ని శాఖలలో వేలు పెడుతున్న విద్యాశాఖ మంత్రి లోకేష్ తన శాఖలో ఉన్న లోపాలను చూసుకోవడం లేదన్నారు. హైయర్ ఎడ్యుకేషన్ కు చైర్మన్ లేరని, పలు యూనివర్శిటీలకు విసిలను నియమించలేదని, సెర్చ్కమిటీ నేటికీ వేయకపోవడం వల్ల విద్యార్థులకు పూర్తిస్థాయి విద్య అందడం లేదన్నారు. గత పాలనలో 2,53 వేలకోట్లుతో బడ్జెట్ పెడితే రాష్ట్రం దివాళా తీసిందని గోల చేసిన చంద్రబాబు తాను. మాత్రం అసెంబ్లీలో 2,94 వేల కోట్లుతో ఏవిదంగా బడ్జెట్ ప్రవేశపెట్టారో తెలియజేయాలని డిమాండ్ చేసారు. చంద్రబాబు ఎప్పుడు అరచేతిలో వైకుంఠం చూపిస్తు న్నారని విమర్శించారు. రాష్ట్రంలో అదానీ చేసిన అవినీతి, లంచాల బాగోతం ఇప్పటికే బైటపడినా కూటమి ప్రభుత్వం అదానీ ఒప్పందాలను రద్దు చేయకుండా చోద్యం చూస్తోందన్నారు. ప్రతి విద్యార్థి పూర్తిస్థాయి విద్యను అభ్యసించి ఏఐఎస్ఎఫ్ బలోపేతం చేయడానికి ప్రయత్నం చేయాలన్నారు. దేశ, రాష్ట్ర రాజకీయాల్లో ఏఐఎస్ఎఫ్ విద్యార్థులు ముందుకు రావాలన్నారు. అనంతరం మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు జి ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రస్తుతం విజయనగరంలో జరుగుతున్న 49వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేసేందుకు రాష్ట్ర ఏఐఎస్ఎఫ్ నాయకత్వం కృషి చేయడం అభినందనీయమన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థుల సమస్యలపై పోరాటం చేసేందుకు ఏఐఎస్ఎఫ్ ముందుంటుందన్న విషయాన్ని విద్యార్థులందరికీ తెలిసేలా ప్రయత్నం చేయాలన్నారు రాజకీయ నాయకులు చెప్పే మాటలు ఎవరికి లబ్ధి పొందేలా ఉన్నాయో గ్రహించాలన్నారు. విద్యకు ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నామన్న చెప్పుకుంటున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇప్పటికే దేశంలో 40 శాతం మంది నిరక్షరాస్యులుగా ఉన్నారన్న విషయం తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు లేక ఫలితాలు పడిపోతున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలో కళాశాలలో హాస్టల్లో కనీస మౌలిక వస్తువులు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారు అన్నారు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలలో కళాశాలలో ఉన్న సమస్యలపై ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యను పూర్తిగా గాలికి వదిలేసాయి అన్నారు. ఇటువంటి సమయంలో ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటం చేయాలన్నారు.రానున్న కాలంలో 175 నియోజకవర్గాలలో ఏఐఎస్ఎఫ్ పూర్తిస్థాయిలో బలోపేతం అయ్యేలా ప్రయత్నం చేయాలన్నారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ శ్రీ రంగరాజన్ మాట్లాడుతూ ప్రస్తుతం నరేంద్ర మోడీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం పేరుతో పేదవారికి విద్యను దూరం చేస్తున్నారన్నారు. బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చినప్పటికీ విద్యార్థులకు ఎంతవరకు న్యాయం చేశారో చెప్పాలన్నారు. దేశవ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ బలోపేతానికి విద్యార్థులంతా సహకరించాలన్నారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ వివిధ జిల్లాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఈ మహాసభలో ఏపీ ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.చంద్రనాయక్, కెన్నం పెంచలయ్య బృందం ఆలపించిన పలు గీతాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి.

దలారీల చేతిలో మోసపోవద్దు

ఎమ్మెల్యే అదితి

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : రైతులు ధలారుల చేతిలో మోసపోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు అన్నారు. గురువారం రాకోడు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు మాట్లాడుతూ ఖరీఫ్ 2024-25 సంవత్సరానికి సంబంధించ సాధారణ రకం ధాన్యానికి క్వింటాల్కు రూ. 2300/- మద్దతు ధర ఉందన్నారు. ఉచిత గోనె సంచులు, లేబర్ ఛార్జీలు, రవాణా ఛార్జీల భారం ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. రైతులు తమకు నచ్చిన రైస్ మిల్లుకు అమ్ముకునే వెసులుబాటు కల్పిందన్నారు. 48 గంటల్లోనే ధాన్యం సొమ్ము రైతు ఖాతాలో జమ చేసే సంస్కరణలు ప్రభుత్వం తీసుకుందన్నారు. అదేవిధంగా విజయనగరం నియోజకవర్గంలో జొన్నవలస, రాకోడు, కోరుకొండ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులు ధలారుల చేతిలో మోసపోకుండా ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమాల్లో జొన్నవలస ఎంపిటిసి రాజేష్ బాబు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బొద్దల నర్సింగరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి నుండి టీడీపీలోకి పలువురి చేరికలు

విశాలాంధ్ర-డెంకాడ: డెంకాడ మండలం ఆకులపేట పంచాయితీలో వైసీపీ పార్టీ సర్పంచ్ సువ్వాడ రమేష్ వార్డు మెంబర్ మరియు వారి అనుచరులతో కలిసి టిడిపి పార్టీలో పార్లమెంట్ అధ్యక్షులు కిమిడి నాగార్జున నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇంఛార్జి, ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర రావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షులు పల్లె భాస్కరరావు ఆధ్వర్యం లో నిర్వహించారు. వైఎస్సార్ పార్టీకి చెందిన సుమారు 40 కుటుంబాలకు కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రజలు ఆకర్షితులై టీడీపీలో చేరుతున్నారని. మనందరి సమస్యలు త్వరలోనే పరిష్కారం అవుతాయి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు విశాఖ నార్త్ పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్,డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్ రావు డెంకాడ మాజీ జెడ్పీటీసీ పతివాడ అప్పలనారాయణరాష్ట్ర కార్యదర్శి పతివాడ తమ్మినాయుడు ,మండల పార్టీ అధ్యక్షులు పల్లె భాస్కరరావు పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కలిదిండి పాణిరాజు రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి పతివాడ శివరామ విద్యాసాగర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేసే శిక్షణ లను రద్దు చెయ్యాలి

విశాలాంధ్ర-గరివిడి : గజపతినగరం బాలాజీ పోలిటెక్నిక్ లో జరుగుతున్న స్కూల్ లీడర్షిప్ ట్రైనింగ్ లో హటాత్తుగా గుండెపోటుతో మరణించిన శ్రీనివాసరావు మృతికి నిరసనగా గరివిడి మండల విద్యా వనరుల కేంద్రం వద్ద భోజన విరామ సమయం లో ప్రభుత్వ మొండి వైఖరి నశించాలని, రెసిడెన్సియల్ శిక్షణ లను, ఉపాధ్యాయులను ఒత్తిడి కి గురిచేసే శిక్షణ లను రద్దుచేయాలని మరణించిన ఉపాధ్యాయునికి కోటి రూపాయల నష్ట ఎక్స్ గ్రేషియో ప్రక టించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ నాయకత్వం నిరసన నిర్వహించి సంబందిత అధికారుల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. రాష్ట్ర కార్య వర్గ సభ్యులు డి. రాము, ఎ. సత్య శ్రీనివాసు, జి. పద్మావతి, మండల బాధ్యులు రవికుమార్, గోపాల కృష్ణ, సూరి శ్రీను, ఎం. సూర్యనారాయణ,ఐక్య సత్యానా రాయణ, బి. బంగార్రాజు,డి. సతీష్, కనకేశ్వర రావు, వరప్రసాద్, కోట్ల రమణ, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు సాంఘీక దురాచారం

విశాలాంధ్ర-శృంగవరపుకోట రూరల్ : బాల్య వివాహాలు ఒక సాంఘిక దురాచారం అని అంగన్వాడి సూపర్వైజర్ సుశీల అన్నారు. మండలంలోని వెంకటరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్గా తీర్చిదిద్దాలని బాల్య వివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థిని లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నాయుడు మాస్టారు, అంగనవాడి టీచర్లు క్రాంతి, శ్రీదేవి, పుష్ప విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే

గురాన అయ్యలు

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషిచేసిన సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని జనసేన నేత గురాన అయ్యలు అన్నారు. జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకుని గురువారం గురాన అయ్యలు కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గురాన అయ్యలు మాట్లాడుతూ దేశంలో కులవివక్ష, అంటరానితనం నిర్మూలనకు కృషి చేసిన తొలి వ్యక్తి పూలే అని కొనియాడారు. శతాబ్దాల నాడే అణగారిన వర్గాలకోసం, స్త్రీ విద్య కోసం చిత్తశుద్ధితో ముందుకు వెళ్లిన మహాత్మా జ్యోతిరావు పూలే చూపిన మార్గం అనుసరణీయమని పేర్కొన్నారు. వారి ఆశయాలను సాధించడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు చింతా కాశీనాయుడు, నాగులపల్లి ప్రసాద్, సిరిపురపు దేముడు,ఎంటి రాజేష్ , ఎమ్ .పవన్ కుమార్ , గొల్లపల్లి మహేష్ , పృథ్వీ భార్గవ్, జి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయాల సాధనకు కృషి చేద్దాం

విశాలాంధ్ర-చీపురుపల్లి : మహాత్మ జ్యోతిరావు పూలే హాస్య సాధన కొరకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామని పూలే, అంబేద్కర్ ఆశయ సమితి సభ్యులు అన్నారు. గురువారం నాడు సాధన సమితి సభ్యులు జ్యోతిరావు పూలే135వ వర్ధంతి సందర్భంగా చీపురుపల్లిలో నెలకొల్పిన పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భముగా వక్తలు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే గొప్ప సంఘసంస్కర్తగా పనిచేశారన్నారు. ఎహిళా విద్యకై పాటుపడి మహిళల అభ్యున్నతి తో పాటు సమాజంలో వారికి సముచిత స్థానం కల్పించే విధంగా వారి హక్కుల కోసం పోరాడారన్నారు. అప్పటికే సమాజాన్ని పట్టి పీడిస్తున్న కుల వ్యవస్థ నిర్మూలనకై నడుము కట్టిన మహాయోధుడు అని ఈ సందర్భంగా వారు కొనియాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతకై పాటుపడిన మహా మనిషిగా మన్ననలు పొందిన మహనీయుడు అన్నారు. సత్య శోధక్ సమాజ్ స్థాపించి సమాజంలోని నిరాశ్రయులకు ఆశ్రయాన్ని కల్పించి ఆదుకున్న గొప్ప వ్యక్తి అన్నారు.సమాజానికి ఆదర్శప్రాయుడు అని ఆయన సేవలను,గొప్పతనాన్ని కొనయాడారు . ఈ కార్యక్రమంలో పూలే అంబేద్కర్ ఆశయ సాధన సమితి నాయకులు మిరియాల కృష్ణారావు, అద్దూరి కృష్ణ, పొదిలాపు వెంకటరావు మామిడి శ్రీనివాసరావు, రేగాన చిట్టిబాబు, నబ్బి సత్యనారాయణ కాపరోతు మురళి, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

గోశాలను సకాలంలో పూర్తి చేయండి..

విశాలాంధ్ర-బాడంగి : మండలంలో మంజూరైన గోసాలను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో రామకృష్ణ లబ్ధిదారులను కోరారు. గ్రామీణ ఉపాధి పథకంలో భాగంగా పల్లె పండుగ విభాగంలో చేపడుతున్నటువంటి వివిధ రకాల పనులను గురువారం పరిశీలించడం జరిగింది. ఇవి పెద్దపల్లి తెంటువలస మరియు లక్ష్మీపురం గ్రామాల్లో ఆయన పనులను పరిశీలించడం జరిగింది. ఇందులో ప్రధానంగా. గోశాల నిర్మాణం పరిశీలిస్తూ కొన్ని సూచనలు చేయడం జరిగింది. మనకి మన మండలంలో 75 గోసాలలు మంజూరు అయ్యాయని అన్నారు. దీంట్లో మనం ఇప్పటివరకు 50 కేటల్ షేడ్స్ ని గ్రౌండింగ్ చేయడం జరిగిందని అన్నారు.మిగతావి కూడా వీలైనంత త్వరగా ప్రారంభమయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇప్పటికే పనులు ప్రారంభించాలని లబ్ధిదారులకు తెలియజేయడం జరిగింది ఒకవేళ ఒకటి లేదా రెండు రోజుల్లో వీటిని గ్రౌండ్ చేయకపోతే గౌరవ జిల్లా కలెక్టర్ ఆదేశాలు అనుసరించి రద్దు చేయడం జరుగుతుంది. కాబట్టి సహకరించాలని కోరడం జరిగింది ఆయన తోపాటు టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లు సచివాలయం ఎంప్లాయిస్ కూడా పాల్గొనడం జరిగింది.

మహాత్మా జ్యోతిభా పూలేకి కలెక్టర్ ఘన నివాళి

విశాలాంధ్ర-విజయనగరం: మహాత్మా జ్యోతిభాపూలే 134వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. కలెక్టరేట్ సమీపంలోని పూలే జంక్షన్ వద్ద గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో, పూలే విగ్రహానికి, చిత్రపటానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే విగ్రహానికి కూడా నివాళులర్పించారు. డిబిసిడబ్ల్యూఓ పెంటోజీరావు, బిసి సంఘ జిల్లా నాయకులు ముద్దాడ మధు మాట్లాడుతూ, జ్యోతిభా పూలే జాతికి చేసిన సేవలను కొనియాడారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, డిపిఆర్ఓ డి.రమేష్, కలెక్టరేట్ ఏఓ దేవ్ ప్రసాద్, ఎబిసిడబ్ల్యూఓలు యశోధనరావు, రాజులమ్మ, శ్యామల, బిసి వసతిగృహ సంక్షేమాధికారులు, వివిధ బిసి సంఘాల నాయకులు పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే కు డాక్టర్ రాజేష్ నివాళులు

విశాలాంధ్ర-రాజాం: మహాత్మ జ్యోతిరావు పూలే 134 వ వర్ధంతి సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళిలు అర్పించిన రాజాం నియోజకవర్గం వైఎస్ఆర్సీపీ ఇంచార్జి డా. తలే.రాజేష్ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఏ తలే.భద్రయ్య, రాజాం టౌన్, రూరల్ కన్వీనర్లు పాలవలస. శ్రీనివాస రావు, లావేటిరాజగోపాల్ నాయుడు, దూబ.గోపాలం, ఆశపుసూర్యం, సలాది. సతీష్ ,డా.నరేంద్ర,పాలవలస. శ్యాంసుందర్ రావు, ముగడ.రవి, వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు బస్టాండ్నుంచి తరలిన రోజువారీ మార్కెట్

విశాలాంధ్ర-జామి: మండల కేంద్రమైన జామిలోని బస్టాండ్లో నిర్వహిస్తున్న రోజువారీ కూరగాయల మార్కెట్ను ఎట్టకేలకు అధికారులు అక్కడనుంచి తరలించారు. గ్రామంలోని పోలీస్ స్టేషన్కు సమీపంలో పశువుల ఆసుపత్రి పక్కన ఉన్న వారపు సంత స్థలంలో ఇప్పటికే గ్రామ పంచాయతీ భారీ ప్రహరీ గోడ నిర్మించి స్థలాన్ని సిద్ధం చేసింది. బస్టాండ్ వద్ద నిత్యం ఉదయం పూట మార్కెట్ సమయంలో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రయాణీకులు, విద్యార్థులు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై చాలా కాలంగా చర్చలు జరుగుతున్నాయి. చివరకు వివిద శాఖ ల అధికారులు దృష్టి సారించడంతో మార్కెట్ తరలింపు సాధ్యమయింది. గురువారం నుంచి కొత్త స్థలంలో రోజువారీ మార్కెట్ను నిర్వహిస్తున్నారు.

సైబర్ నేరాలపై గంజాయి అక్రమ రవాణా పై ఉక్కు పాదం : విశాఖ రేంజ్ డిఐజీ గోపీనాథ్ జట్టి

విశాలాంధ్ర-మెరకముడిదాం: గంజాయి అక్రమ రవాణా, సైబర్ క్రైమ్ నివారణ మరియు మహిళలు చిన్నపిల్లలపై అఘాయిత్యాలు అరికట్టేందుకు సంకల్పం అనే అవగాహన కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ అన్నారు.గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు ఎటువంటి సమాచారం ఉన్న 1972 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేయాలని అన్నారు. ఇప్పటివరకు గంజాయి అక్రమ రవాణాపై 289 కేసులు నమోదైనట్లు వెల్లడించారు. గంజాయి అక్రమ రవాణాకు డైనమిక్ చెక్ పోస్టులను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 29 స్పెషల్ టీములను గంజాయి అక్రమ రవాణా అరికట్టేందుకు నియమించినట్లు తెలిపారు గురువారం బుదరాయవలస పోలీస్ స్టేషను సందర్శించి పలు దస్త్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంకల్పం అనేది సైబర్ క్రైమ్, గంజాయి అక్రమ రవాణా మరియు మహిళలు చిన్నపిల్లలపై అఘాయిత్యాలు నివారించేందుకు చేపట్టే ఒక అవగాహన కార్యక్రమంఅన్నారు.ఈరోజు సైబర్ క్రైమ్ అనేది పెను సవాళ్లుగా మారిందని, ఈ విషయమై బ్యాంకర్లతో కూడా ప్రజల్లో అవగాహన కార్యక్రమాల్ని చేపడుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా మండలంలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవలసిందిగా విలేకరులని అడగ్గా మండలంలో పలు మలుపుల వద్ద ముఖ్యంగా జనావాసాలు నివసిస్తున్న మలుపులు వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవించి ప్రాణాలు కోల్పోతున్నారని డీఐజీ దృష్టికి విలేకరులు తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వకుల్ జిందాల్, డి.ఎస్.పి.ఎస్ రాఘువులు,సీఐ జి శంకర్రావు,మెరకముడి దాం ఎస్సై జె.లోకేష్ కుమార్, గరివిడి ఎస్సై బి లోకేశ్వరరావు మరియు పోలీస్ సిబ్బంది, మండలంలో ఉన్న మహిళా పోలీసులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

విశాలాంధ్ర-చీపురుపల్లి : రక్తదానం చేసి ప్రతి ఒక్కరూ ప్రాణదాతలు కావాలని చిగురుపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ విసనగిరి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం నాడు చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు స్వామినాయుడు సారథ్యంలో చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విసనగిరి తనయుడు వి .శివరాం, వారి స్నేహితులు గట్టు చక్రవర్తి, రెడ్డి, డి శ్రీ చరణ్, జె అభి, పి ప్రణవ్, పి ప్రణీత్, డి శ్రీ చరణ్, సిహెచ్ అజయ్ కుమార్,జె చంద్రశేఖర్, లు ఆల్ ఇండియా చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చిరంజీవి గారి మాటలకు స్ఫూర్తిగా ఈ రోజున చిరంజీవి బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేయడం చాలా ఆనందంగా ఉందని, వారందరినీ అభినందించారు. నేత్రదానం అవయవ దానం కూడా ప్రతి ఒక్కరు చేయాలని కోరారు. అనంతరం చారిటబుల్ ట్రస్టు ద్వారా రక్తదానం చేసిన యువకులు ధ్రువీకరణ పత్రాలను తీసుకున్నారు.

క్రీడా స్ఫూర్తితో సమాజానికి మెరుగైన సేవలందించాలి

- రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి
- ఘనంగా ప్రారంభమైన 31వ వార్షిక జిల్లా పోలీసు ఉద్యోగుల క్రీడా పోటీలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: పోలీసు పరేడ్ గ్రౌండు నందు జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నవంబరు 28న నిర్వహించిన వార్షిక జిల్లా పోలీసు స్పోర్ట్స్ మరియు గేమ్స్ మీట్ 2024 ప్రారంభ వేడుకల్లో విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి, ఐపిఎస్ ముఖ్య అతిథిగా హాజరై, క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ వార్షిక క్రీడా పోటీలను నవంబరు 28 నుండి 30 వరకు మూడు రోజులపాటు నిర్వహించనుండగా, జిల్లా పోలీసుశాఖకు చెందిన విజయనగరం, బొబ్బిలి, చీపురుపల్లి సబ్డివిజన్లు, ఆర్మ్డ్ రిజర్వు విభాగానికి చెందిన నాలుగు జట్లు వివిధ స్పోర్ట్సు అండ్ గేమ్సు మీట్లో పోటీ పడి, తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించనున్నాయి. ఈ సందర్భంగా విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి, ఐపిఎస్ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగులు అన్ని రంగాల్లోను ఇతరులకు రోల్ మోడల్ గా ఉండాలన్నారు. ఉద్యోగరీత్యా పోలీసులు అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న కారణంగా శిక్షణలో ఉన్న శారీరక సామర్థ్యాన్ని కొనసాగించడం కష్టంగా మారుతున్నదన్నారు. కానీ, శారీరక సామర్థ్యంతోపాటు మానసిక ఆనందం కూడా చాలా అవసరమని, వాటిని మెరుగుపర్చుకోవడానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ..ఈ క్రీడల్లో గెలుపు ఓటములు ముఖ్యం కాదని, ఉద్యోగులందరూ ఒక్కటిగా పని చేయడం, విజయానికి అవసరమైన సహాయ, సహకారాలను ఒకరికొకరు అందించుకొనే క్రీడా స్ఫూర్తి ఉద్యోగుల్లో అవసరమన్నారు. ఓడిపోయే పరిస్థితుల నుండి విజయాన్ని సాధించడానికి ఏవిధంగా ఒడిదుడుకులను ఎదుర్కొనాలి, పని చేయాలన్న విషయాన్ని ప్రతీ ఒక్కరూ క్రీడల ద్వారా తెలుసుకోవాలన్నారు. పోలీసుల విధి నిర్వహణలో శారీరక, మానసిక సామర్థ్యం చాలా ముఖ్యమని, అందుకు అవసరమైన స్ఫూర్తిని క్రీడలతో పొందాలన్నారు. 31వ వార్షిక క్రీడలను విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి గాలిలోకి బెలూన్లు, కపోతాలను ఎగురవేసి ప్రారంభించారు. అదేవిధంగా జిల్లా పోలీసుశాఖకు చెందిన విజయనగరం, బొబ్బిలి, చీపురుపల్లి సబ్ డివిజన్లకు, ఆర్మ్ రిజర్వుకు చెందిన నాలుగు జట్లు వివిధ క్రీడాంశాల్లో పోటీపడి, తమ క్రీడాప్రతిభను ప్రదర్శించనున్నాయి. పురుషుల 400 మీటర్ల పరుగు పందెంను, మహిళల 100 మీటర్ల పరుగు పందెంను విశాఖ రేంజ్ డీఐజి ప్రారంభించి, విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులను, సర్టిఫికేట్స్, మెడల్స్ ప్రధానం చేసారు. క్రీడా పోటీల ప్రారంభ వేడుకల్లో వివిధ పోలీసు జట్లు నిర్వహించిన మార్చ్ పాస్ట్ ఆహ్వానితులను ఎంతగానో ఆకట్టుకోగా, ఈ పోటీల్లో క్రీడా స్ఫూర్తితో వ్యవహరిస్తామని, విధులను అంకిత భావంతో నిర్వర్తిస్తామని పోలీసు ఉద్యోగులు ప్రతిజ్ఞ చేసారు. ఈ క్రీడా పోటీల ప్రారంభ వేడుకలకు వి.శ్రీనివాసరావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

ఈ వార్షిక క్రీడా పోటీల ప్రారంభ వేడుకల్లో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్పీ జి. నాగేశ్వరరావు, విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డిఎస్పీ పి.శ్రీనివాసరావు, చీపురుపల్లి డిఎస్పీ ఎస్.రాఘువులు, డిటిసి డిఎస్పీ ఎం.వీరకుమార్, ఎఆర్ డిఎస్పీ యూనివర్స్, సిఐలు ఎల్.అప్పల నాయుడు, ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కే.చౌదరి, టి.శ్రీనివాసరావు, బి.లక్ష్మణరావు, బి.వెంకటరావు, జి.రామకృష్ణ, వెంకటేశ్వరరావు, ఈ.నర్సింహ మూర్తి, ఆర్ఐలు ఎన్. గోపాల నాయుడు, ఆర్.రమేష్ కుమార్, శ్రీనివాసరావు, పలువురు ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర
పేజి: 2
విజయనగరం
శుక్రవారం 29, నవంబర్ 2024

జ్యోతిరావు పూలేకు ఘన నివాళులు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక విజయనగరం నగరపాలక అధ్యక్షులు సప్ప ప్రసాద్ ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సప్ప ప్రసాద్ మాట్లాడుతూ జ్యోతిబాపూలే ఎనలేని పోరాటాలు చేసి అస్పృశ్యతను రూపుమాపి కులాహంకారాన్ని ఎదిరించి వ్యతిరేకంగా పోరాడారన్నారు. దేశంలోనే మొట్టమొదటి ఉపాధ్యాయురాలుగా తన భార్యను తీర్చిదిద్దిన ఘనత ఆయనకే చెందిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ భాస్కర్ రెడ్డి పట్టణ ఉపాధ్యక్షుడు. మహంతి అప్పలనాయుడు. కోశాధికారి పప్పు విశ్వనాథం కార్యదర్శి టి ప్రసాద్ సభ్యులు బహుదూరాన్ కే వెంకటేష్ ఎన్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల హక్కులను పరిరక్షించాలి

కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: విభిన్న ప్రతిభావంతుల హక్కులను పరిరక్షించేందుకు ప్రతీఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతుల హక్కుల చట్టం-2016 అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం జరిగింది. ముందుగా జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడి జగదీష్ మాట్లాడుతూ, చట్టం గురించి వివరించారు.ఎన్‌జీఓ ప్రతినిధి, జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ కెఆర్‌డి ప్రసాద్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రస్తావించారు. దివ్యాంగుల ఫిర్యాదులపై మండల మేజిస్ట్రేట్ అయిన తాసిల్దార్ తొలుత స్పందించాల్సి ఉందని, ఈ మేరకు ఆదేశాలను జారీ చేయాలని కోరారు. అన్ని రకాల వికలాంగత్వానికి ఇక్కడే సదరం ధృవపత్రాలను జారీచేసే సదుపాయం కల్పించాలని సూచించారు. ఆటిజంతో బాధపడుతున్న వారికి బీమా కల్పించాలన్నారు. ఉచిత విద్య సౌకర్యాన్ని పకడ్బందీగా అమలు చేసి, పాఠశాలలకు సకాలంలో బిల్లులు చెల్లించాలన్నారు. అంధ ఉద్యోగుల సంఘం నాయకులు ఉమాశంకర్ మాట్లాడుతూ, అంధ ఉద్యోగులకు కొన్ని శాఖల్లో ఉన్నతాధికారులనుంచి వేధింపులు ఎదురవుతున్నాయని, వాటిని అరికట్టాలని, వారు చేయగలిగే పనులను మాత్రమే చెప్పాలని కోరారు. మూగ, చెవిటి అసోసియేషన్ నాయకురాలు లక్ష్మి మాట్లాడుతూ, సదరం ధృవపత్రాల్లో తప్పులు సరిచేయాలని, డ్రైవింగ్ లైసెన్సులు ఇప్పించాలని, అందరికీ బస్ పాస్‌లు మంజూరు చేయాలని, అనువాదకుడిని నియమించాలని కోరారు.సీనియర్ సివిల్ జడ్జి, లీగల్ సెల్ కార్యదర్శి టివి రాజేష్‌కుమార్ మాట్లాడుతూ, తాము ప్రభుత్వ విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలను సందర్శించిన సమయంలో గుర్తించిన సమస్యలను ప్రస్తావించారు. వారికి మంచాలు, పరుపులు తదితర మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే వారికి సహాకరంగా ఉండేందుకు అదనంగా నాలుగో తరగతి ఉద్యోగిని నియమించాలని సూచించారు. నియోజకవర్గాలవారీగా అవగాహనా సదస్సులు నిర్వహించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ, 2016 చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషి చేయాలని వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ శాఖల్లో విభిన్న ప్రతిభావంతుల ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. మూగ, చెవిటివారికి సహకారం అందించేందుకు గాను అవుట్‌సోర్సింగ్ పద్దతిలో అనువాదకుడిని నియమించాలని సూచించారు. అన్ని రకాల వికలాంగత్వం ఉన్నవారికీ సదరం సర్టిఫికేట్లను జిల్లాలోనే ఇప్పించేలా ప్రభుత్వానికి నివేదిస్తామని హామీ ఇచ్చారు. ఇకనుంచీ ఆర్‌డిఓలను కూడా సమావేశాలకు రప్పించాలని సూచించారు. ఆటిజంతో బాధ పడుతున్నవారికి బీమా సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తామని, ఇతర సమస్యలను పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. సమావేశంలో జెడ్‌పి సిఈఓ బివి సత్యనారాయణ, డిఈఓ యు.మాణిక్యం నాయుడు, డిఎంఅండ్‌హెచ్ డాక్టర్ రాణి, డిసిహెచ్‌ఎస్ రాజ్యలక్ష్మి, ఎల్‌డిఎం మూర్తి, మెప్మా పిడి జివి చిట్టిరాజు, డిఎస్‌డిఓ వెంకటేశ్వరావు, డిఎస్‌పి వీరకుమార్, పిఆర్ ఎస్ఈ శ్రీనివాసరావు ఇతర అధికారులు, అసోసియేషన్ల ప్రతినిధులు, ఎన్‌జీఓలు పాల్గొన్నారు.

రీసర్వే ప్రక్రియ వేగవంతం చేయాలి

కమిషనర్ పల్లి నల్లనయ్య

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: విజయనగరం పరిధిలో చేపడుతున్న అర్బన్ రీసర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని సిబ్బందికి అడ్మిన్ కార్యదర్శులకు కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఈ మేరకు గురువారం కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్బన్ రీసర్వే ప్రక్రియలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వాటికి తగిన పరిష్కార మార్గాలను చూపారు. అడ్మిన్ మరియు ప్రణాళిక కార్యదర్శులు,సిబ్బంది సమన్వయంతో రీసర్వే పూర్తిచేయాలని ఆదేశించారు. ఈఆర్పి పక్కాగా అమలు కావాల్సిందేనని అన్నారు. ఏ ఒక్క అసెస్మెంట్ తప్పకూడదని అన్నారు. శనివారం నాటికి ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు. సచివాలయాల పరిధిలో ఉన్న హద్దుల వరకు ఎవరి పరిధిలో వారు భూమి యొక్క సమాచారం, హక్కుదారుల సమాచారం నిక్షిప్తం చేయాలని అన్నారు. అలాగే ఏ ఇంటికి అసెస్మెంట్ ఉందో లేదో సులభతరంగా తెలుసుకునేందుకు స్టిక్కర్లు అతికించే ప్రక్రియ శుక్రవారం నుండి ప్రారంభించాలని తెలిపారు. ఈఆర్పీని తక్షణమే డౌన్లోడ్ చేసి ప్రక్రియను మొదలు పెట్టాలని అన్నారు. ప్లానింగ్ బౌండరీలను దృష్టిలో పెట్టుకోవాలని చెప్పారు. ఈ విషయంలో ఇంటింటికి తమ సచివాలయ కార్యదర్శులు సిబ్బంది వచ్చి స్టిక్కర్లు అతికిస్తారని కావున ప్రజలు సిబ్బందితో సహకరించాలని కోరారు. అలాగే పన్నులు వసూళ్లను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ప్రతివారం సమీక్షలు నిర్వహించి లక్ష్యాల వివరాలను తెలుసుకుంటామని చెప్పారు. కుళాయి పన్నులను చెల్లించని వారి కుళాయి కనెక్షన్లను తొలగించివేయాలని స్పష్టం చేసారు. ఈ సమావేశంలో సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రమణమూర్తి, హరిబాబు, సర్వేయర్ సింహాచలం, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

16వ డివిజన్‌లో వార్డు పర్యటన

నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : విజయనగరంలోని 16వ డివిజన్ లో జరిగిన వార్డు పర్యటనలో నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు పాల్గొన్నారు. 19 నెంబర్ సచివాలయం నుండి ప్రారంభమైన వార్డు పర్యటనలో స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలకు ఉపయుక్తంగా ఉండే బోర్ వెల్ చెట్టు దిమ్మన ఏర్పాటు చేయాలని అలాగే పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. అంబటి సత్రం నుండి కొత్తపేట వెళ్లే రహదారిలో ప్రధాన కాలువను మరమ్మతులు చేయాలని సూచించారు. అలాగే కొణిశి వీదికి వెళ్లే రహదారిలో ప్రధాన కాలువను కప్పివేసి సోఫాలు తయారీ కై అవసరమైన సామగ్రిని కాలువ పై ఉంచడాన్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే తొలగించాలని ఆదేశించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని, మధ్యాహ్నం భోజన పథకం అమలు ను పరిశీలించారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కమిషనర్ పల్లి నల్లనయ్య సూచనలతో ప్రతి గురువారం వార్డు పర్యటనలు చేపడుతున్నామన్నారు. తమ పర్యటనలో గమనించిన క్షేత్రస్థాయి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి అవి పరిష్కారం అయ్యే విధంగా చూస్తామన్నారు. స్థానిక కార్పొరేటర్ గుజ్జల నారాయణరావు మాట్లాడుతూ తమ డివిజన్లో క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, అవి పరిష్కారం అవుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ విధంగా అధికారులు డివిజన్లో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకోవడం శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెంటువలసలో సచివాలయం ప్రారంభించిన ఎమ్మెల్యే బేబీనాయన, బుడా చైర్మన్ లక్ష్మంనాయుడు

విశాలాంధ్ర -బాడంగి: బాడంగి మండలం, తెంటు వలస గ్రామంలో "సచివాలయాన్ని గురువారం ఎమ్మెల్యే బేబీ నాయన, బుడా చైర్మన్ లక్ష్మనాయుడులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామ అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని అన్నారు. గ్రామాలు మౌలిక సదుపాయాల కల్పన కు చేయూతను అందిస్తుందన్నారు. రైతుల సంక్షేమం కోసం పలు గ్రామాల్లో ధన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తెంటువలస సర్పంచ్ తెంటు చిరంజీవి, వైస్ ఎంపీపీ సింగిరెడ్డి భాస్కరరావు బాడంగి మండల టీడీపీ అధ్యక్షులు తెంటు రవి పెద్దపల్లి సర్పంచ్ ఆవు సత్యనారాయణ, లచ్చుపతుల సత్యం గారు, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేద ప్రజలకు ఒక వరం : రామ్ మల్లిక నాయుడు

విశాలాంధ్ర చీపురుపల్లి : ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేదలకు ఒక వరం అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామ్ మల్లిక నాయుడు అన్నారు చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళావెంకటరావు ఆదేశాలతో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ లను గురువారం చీపురుపల్లిలో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయము నందు ఆయన అందజేశారు. 1.గరివిడి మండలం దువ్వాం గ్రామానికి చెందిన కింతాడ రేవంత్ రమణ కుటుంబ సభ్యులకు రూ.2,56,000లను, 2.మెరకముడిదాం మండలం చెల్లాపురం పంచాయతీ,చినరవ్వం గ్రామానికి చెందిన పెనుమజ్జి వెంకట రమణ కుమార్తె జ్ఞానేశ్వరి కుటుంబ సభ్యులకు రూ.2,52,000 ల చెక్ లను అయినా పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ లో టిడిపి కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో నిత్యం పేద ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆపదలో ఉన్న ప్రతి ఒక్క కుటుంబానికి వైద్య ఖర్చులకు అవసరమైన డబ్బులను ముఖ్యమంత్రి సహాయనిధి పథకము ద్వారా పేద ప్రజలకు అందిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు తరుపున హృదయ పూర్వక ధన్యవాదాలను తెలియజేసిన తెలుగుదేశం పార్టీ యువ నాయకులు, రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ మల్లిక్ నాయుడు ఈ సందర్భంగా రామ మల్లిక్‌నాయుడు మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు కూటమి ప్రభుత్వంలో గౌరవ శాసనసభ్యులు కిమిడి కళావెంకటరావు ఆదేశాలతో మన చీపురుపల్లి నియోజకవర్గ టీడీపి కూటమి నాయకులకు, కార్యకర్తలకు,ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి యొక్క సమస్యలు తెలుసుకుంటూ ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకు వెళ్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెరకముడిదాం,గరివిడి మండలాలకు చెందిన తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పు సడలింపు విధానంపై అవగాహన

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: మురికివాడలు, ఇరుకు రహదారుల్లో భవన నిర్మాణ అనుమతులు పొందుటకు రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు వెడల్పు సడలింపు విధానానం ద్వారా ప్రతి ఒక్కరూ అనుమతులు తీసుకోవాలని నగర ప్రజలకు కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం నగరపాలక సంస్థ కార్యాలయం నందు పట్టణ ప్రణాళిక అధికారులు, సిబ్బంది, కార్యదర్శులకు రోడ్డు వెడల్పు సడలింపు విధానంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు రోడ్డు వెడల్పు సడలింపులో ఉన్న ప్రాంతాలను గుర్తించి ఒక ప్లాన్ తయారుచేసి, గౌరవ కౌన్సిల్ వారి ముందస్తు అనుమతి తో సంబంధిత అధికారైన రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఫర్ టౌన్ ప్లానింగ్ వారి అనుమతి పొందిన తర్వాత సదరు ప్రాంతాలలో భవన నిర్మాణ అనుమతుల కొరకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రక్రియ ప్రకారం రహదారి వెడల్పు సడలింపు ఆన్లైన్ ద్వారా ప్లాన్లు మంజూరు చేయనున్నామని తెలిపారు. ఆన్లైన్ ద్వారా భవన నిర్మాణ అనుమతులు పొందే సమయంలో షార్ట్ ఫాల్ డాక్యుమెంట్లు, లైసెన్స్ ఫీజులు చెల్లిస్తూ పెండింగ్ లో ఉన్న భవన నిర్మాణ అనుమతులకు సంబంధించిన యజమానుల కు అనుమతులు మంజూరు చేసేందుకు నిర్దిష్ట విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందన్నారు. పెండింగ్ లో ఉన్న భవన యజమానులు, లైసెన్సుడ్ టెక్నికల్ పర్సన్ల ద్వారా తిరిగి ఆన్లైన్ చేసుకున్నట్లయితే అట్టి దరఖాస్తులకు, నిర్మాణ అనుమతులు మంజూరు చేస్తామన్నారు. గతంలో ఇచ్చిన టీడీఆర్ లపై రీ వెరిఫికేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించమన్నారు. అలాగే పెండింగ్ లో ఉన్న ఇతర పట్టణ ప్రణాళిక కార్యకలాపాలపై నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని కార్యదర్శులకు ఆదేశించామన్నారు. పెండింగ్ లో ఉన్న భవన యజమానులు, ఎల్టిపీలు అనుమతులు పొందుటకు వీలుగా సంబంధిత సచివాలయాల ద్వారా సమాచారం తెలుసుకొని ఆన్లైన్లో నమోదు చేసి అనుమతులు పొందవచ్చునని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రమణమూర్తి, హరిబాబు పాల్గొన్నారు.

రైస్‌మిల్లు లు తనిఖీ చేసిన తాసిల్దార్

విశాలాంధ్ర-తెర్లాం: మండలం లో ఉన్న రైస్ మిల్లులను గురువారం తాసిల్దార్ జి హేమంత్ కుమార్ తెర్లాం లో ఉన్న రైస్ మిల్లలను, వెలగవలస ఉన్న రైస్ మిల్లులను తనిఖీ చేశారు. అనంతరం మిల్లు యజమానులతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో ఇటువంటి జాప్యం లేకుండా చేయాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ట్రక్ సీట్లు వెంటనే ఎకనాజిమ్మెంట్ చేయాలని సూచించారు. కస్టోడియన్ ఆఫీసర్లకు తగు సూచనలు జారీ చేశారు. ఈయనతో వీఆర్వో డి రాము, పాల్గొన్నారు.

చెత్త తరలింపు వాహనాన్ని ప్రారంభించిన మున్సిపల్ కమిషనర్: జె.రామప్పలనాయుడు

విశాలాంధ్ర-రాజాం: రాజాం మున్సిపాలిటీలో ప్రతిరోజు సేకరిస్తున్న చెత్తను వైజాగ్లో జిందాల్ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ కు తరలించనున్నట్లు కమిషనర్ రామప్పల నాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం చెత్త తరలించే వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించినారు. పట్టణంలో ఉత్పన్నమగు వ్యర్థాలను జిందాల్ ప్లాంట్ కు తరలించడం ద్వారా కరెంట్ ఉత్పత్తి అవుతుందని, తద్వారా డంపింగ్ యార్డుకు తరలించే సమస్యని నివారించవచ్చని దీనినే రి యూజ్ ప్రక్రియ అంటారని ఆయన తెలిపారు. సదురు కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాసరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ చేగొండి హరిప్రసాద్, సానిటరీ సూపర్వైజర్ మరదాన అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణలో మృతి చెందిన శ్రీనివాసరావు కుటుంబానికి కోటి రూపాయలు పరిహారం అందించాలి

విశాలాంధ్ర-బొబ్బిలి : గజపతి నగరం మండలం మరుపల్లిలో ఎస్ ఎల్ డి పి ట్రెనింగ్ సెంటర్లో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు మృతి చెందడానికీ కారణం రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వడమే తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానాన్ని విరమించుకోవాలని బొబ్బిలి డిప్యూటీ డీఈవో కార్యాలయం వద్ద యుటియఫ్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ ఎల్ డి పి ఎఫ్ ఎల్ ఎన్ ట్రెనింగ్లు రెసిడెన్షియల్ మోడ్ లో కాకుండా నాన్ రెసిడెన్షియల్ విధానంలో ఇవ్వాలని,శిక్షణ కేంద్రంలో మృతి చెందిన ప్రధానోపాధ్యాయులకు కోటి రూపాయలు నష్టపరిహారం అందించాలని, నాన్ రెసిడెన్షియల్ శిక్షణ రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో నిర్వహించాలని,బోధనకు ఆటంకం లేకుండా శిక్షణలన్నీ వేసవి సెలవుల్లో నిర్వహించాలని డిమ్యాండ్ చేశారు.

రుణ వసూళ్లను పెంచి ఎన్‌పిఏలు తగ్గించాలి

పర్సన్ ఇన్ ఛార్జి ఎస్.సేతుమాధవన్ ఆదేశాలు

విశాలాంధ్ర-విజయనగరం,: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా ఖాతాదారులకు గతంలో మంజూరు చేసిన వివిధ రకాల రుణాల రికవరీలను చేపట్టి నిరర్ధక ఆస్తులను తగ్గించాలని బ్యాంకు పర్సన్ ఇన్ ఛార్జిగా వ్యవహరిస్తున్న జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ ఆదేశించారు. బ్యాంకులో పనిచేస్తున్న మేనేజర్లు, సూపర్‌వైజర్లు రుణవసూళ్లకు సంబంధించి తమకు కేటాయించిన లక్ష్యాలను సాధించాలని స్పష్టంచేశారు. డిసిసిబి జనరల్ బాడీ సమావేశం బ్యాంకు పర్సన్ ఇన్ ఛార్జి, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ అధ్యక్షతన గురువారం వర్చ్యువల్‌గా నిర్వహించారు. ఈ సందర్భంగా బోర్డు సమావేశం కూడా నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబరు నుంచి జె.సి. పాల్గొనగా, బ్యాంకుకు అనుబంధంగా వున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పి.ఐ.సి. కమిటీ సభ్యులు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. బ్యాంకులో వివిధ దశల్లో ఎలాంటి అవకతవ కలకు తావులేని విధంగా నియంత్రణలు వుండాలని జె.సి. స్పష్టంచేశారు. బ్యాంకు ఆర్థిక కార్యకలాపాల నిర్వహణకు ఒక స్టాట్యుటరీ ఆడిటర్‌ను నియమించేందుకు అనుమతి కోసం రిజర్వుబ్యాంకును కోరేందుకు సమావేశంలో నిర్ణయించారు. జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణపై సమావేశంలో చర్చించారు. జిల్లాలో ప్రస్తుతం 60 సంఘాల కంప్యూటరీకరణ కోసం ఆన్‌లైన్ ప్రక్రియ జరుగుతోందని సి.ఇ.ఓ. సిహెచ్.ఉమామహేశ్వరరావు తెలిపారు. ప్రస్తుతం ప్రి మైగ్రేషన్ దశకు చేరుకుందన్నారు. సమావేశంలో డిసిసిబి సిఇఓ సిహెచ్.ఉమామహేశ్వరరావు, జిల్లా సహకార అధికారి పి.రమేష్, నబార్డు డి.డి.ఎం. టి.నాగార్జున పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే ఆశయ సాధనకై కృషి చేయండి

మున్సిపల్ చైర్మన్ వెంకట మురళీకృష్ణ రావు

విశాలాంధ్ర-బొబ్బిలి : బడుగు బలహీన వర్గాల హక్కులకై పోరాడిన మహనీయుడు సామాజిక ఉద్యమకారుడు జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా నియోజక వర్గం వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ రావు ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో వైయస్సార్ నాయకులు రమేష్ నాయుడు ,వైస్ చైర్మన్ గోలగాని రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కోర్ట్ కేసుల పర్యవేక్షణకు జిల్లా లీగల్ సెల్ ఏర్పాటు

కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: హై కోర్ట్, జిల్లా కోర్ట్ లలో ఫైల్ అయిన కేసులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించ డానికి, కంటెంప్ట్ లు పడకుండా అవసరమగు కౌంటర్లను వేయడానికి జిల్లా స్థాయి లీగల్ సెల్ ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. డిప్యూటీ కలెక్టర్ పి.మురళీ కృష్ణ ను నోడల్ అధికారిగా నియమిస్తూ సహాయకులుగా డిప్యూటీ తహసిల్దార్లను ఎం. ఉమా, సి.హెచ్ రాజేశ్వరి , జూనియర్ అసిస్టెంట్ ఏ శివ సాయి కిరణ్ లను, లైజన్ అధికారిగా టి.రామకృష్ణ, సూపరింటెండెంట్ లను నియమించారు. జిల్లా కలెక్టర్ గురువారం తన ఛాంబర్ లో లీగల్ సెల్ సభ్యులతో సమావేశం నిర్వహించి పలు సూచనలను జారీ చేసారు. కోర్ట్ వెబ్సైటు లో ప్రతి రోజు తనిఖీ చేసి జిల్లాకు సంబంధించి రెవిన్యూ, ఇతర శాఖలకు చెందిన కేసులేమైనా నమోదైనవా, కోర్ట్ ఆర్డర్స్ పడ్డయా అనే విషయాలను తనిఖీ చేసి ప్రింట్ లు తీసి సంబంధిత శాఖలకు వెంటనే పంపాలని నోడల్ అధికారికి సూచించారు. అలాగే సంబంధిత జి.పి కు ఇన్ స్ట్రక్షన్ ను పంపించి కాపీ ను కలెక్టర్ కు పంపాలని తెలిపారు. కోర్ట్ ఆర్డర్స్ పడితే సంబంధిత అధికారులతో వెంటనే కౌంటర్ ఫైల్ చేసేలా చూడాలని, కంటెంప్ట్ కు అవకాశం ఇవ్వకూడదని తెలిపారు. నిర్దేశిత ప్రోఫార్మ తయారు చేసి కేసులకు సంబంధించిన సమాచారాన్ని సమర్పించడానికి వీలుగా అధికారులందరికీ ఈ రోజే పంపించాలని, ప్రతి శనివారం జిల్లా మొత్తం కేసుల వివరాలను తనకు సమర్పించాలని, సోమవారం పిజిఆర్ఎస్ లో హెచ్.ఓ.డి ల తో కేసు ల పై సమీక్షిస్తానని కలెక్టర్ తెలిపారు. సమావేశం లో డి.ఆర్.ఓ శ్రీనివాస మూర్తి, డిప్యూటీ కలెక్టర్ మురళీకృష్ణ, డిప్యూటీ తహసిల్దార్లు పాల్గొన్నారు.

ధాన్యం మిల్లులను తనిఖీ చేసిన జెసి సేతుమాధవన్

విశాలాంధ్ర-గంట్యాడ: మండలంలోని రావివలస, సిరిపురం ధాన్యం మిల్లులను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ తనిఖీ చేశారు. ఆయన గంట్యాడ మండలంలో గురువారం విస్తృతంగా పర్యటించారు. ధాన్యం మిల్లుల్లో తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. ట్రక్‌షీట్లపై ఆరా తీశారు. కస్టోడియన్ అధికారులు, వాహన పర్యవేక్షణ అధికారులతో మాట్లాడారు. రైతులకు సకాలంలో ధాన్యం డబ్బులు వారి ఖాతాల్లో పడేవిధంగా చర్యలు తీసుకోవాలని, ఆలస్యం జరగకుండా చూడాలని ఆదేశించారు. ఈ పర్యటనలో సివిల్ సప్లయిస్ డిఎం మీనాకుమారి, తాసిల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, సిఎస్‌డిటిలు, ఇతర సిబ్బంది ఉన్నారు.

డిసెంబర్ 3న వాసవీ క్లబ్ రజతోత్సవ వేడుకలు

విశాలాంధ్ర- విజయనగరం: పోర్ట్ వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రారంభించి 25 సంవత్సరాలు పూర్తి కావస్తున్న శుభతరుణంలో డిసెంబర్ 3వ తేదీన రజతోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ వైస్ గవర్నర్ ఆలవెల్లి శేఖర్ తెలిపారు. గురువారం క్లబ్ కార్యాలయంలో వేడుకల ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. డిసెంబర్ 3 ఉదయం 8 గంటలకు శ్రీ మన్నార్ రాజగోపాల స్వామి దేవాలయం వద్ద శ్రీ వెంకటేశ్వర గానామృత కళ్యాణ మహోత్సవం మరియు సాయంత్రం వాసవీ క్లబ్ రాజతో త్సవ వేడుకలు స్థానిక ఎస్.వీ.ఎన్ హెూటల్ లోను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత గవర్నర్లు, అధ్యక్షులు పాల్గొంటున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో వాసవి క్లబ్ అధ్యక్షులు చెన్నా బుచ్చి జనార్ధనారావు, కార్యదర్శి కె. రత్నారావు, కోశాధికారి విజ్జపు విజయకుమార్,విన్నకోట రమేష్ కుమార్ గుంపిన నారాయణరావు, ప్రాజెక్ట్ చైర్మన్ బొద్దు పండు,పెదబాబు,మాచర్ల చంద్రశేఖర్ గుప్తా,చిట్టూరి మురళీకృష,డిమ్స్ రాజు,సముద్రాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేసిన స్కానింగ్ సెంటర్ లపై కఠిన చర్యలు

విశాలాంధ్ర విజయనగరం టౌన్ :లింగ నిర్ధారణ చేసిన స్కానింగ్ సెంటర్ లపై కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె రాణి అన్నారు. గురువారం జిల్లా స్థాయి అడ్వైజరి కమిటీ సమావేశము జిల్లా వైద్య , ఆరోగ్య శాఖాధికారి డా. కె. రాణి అధ్యక్షతన గర్భధారణ పూర్వ మరియు గర్భస్థ పిండ ప్రక్రియ చట్టం 1994 అమలుపై నియమించిన జిల్లా స్థాయి, ఉప జిల్లా స్థాయి అడ్వయిజరి కమిటీ సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భస్థ పిండ పరిస్థితి, వ్యాధుల గుర్తింపు తదితర పరీక్షలకు వినియోగించవలసిన యంత్రాలను లింగ నిర్ధారణకు ఉపయోగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన చట్టాన్ని తప్పక అమలు చేస్తామని కమిటీ సభ్యులు చెప్పారు. ప్రోగ్రామ్ అధికారులకు స్కానింగ్ సెంటర్ లను విధిగా పర్యవేక్షించాలని - అసిస్టెడ్ రీ ప్రొడక్టివ్ టెక్నాలజీ రేగులేషన్ చట్టం - 2021, సరోగసి రేగులేషన్ చట్టం -2021 ప్రకారం జిల్లాలోని ఫెర్టిలిటీ కేంద్రాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆలోచించారు. ఈ కార్యక్రమం లో వ్యాధి నిరోధక టీకా అధికారి, పి.సి.పి.ఎన్.డి.టి నోడల్ అదికారి డా. అచ్చుత కుమారి, ఉప జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డా. ఎన్. సూర్యనారాయణ, డా. సుధ రాణి, స్త్రీ వైద్య నిపుణులు ఘోషా ఆసుపత్రి, డా. కిషోర్ కుమార్, చిన్న పిల్లల వైద్య నిపుణులు, ఘోషా ఆసుపత్రి జి. చైతన్య , నేచర్ ఎన్జీవో డా. వి.వి.బి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రైతులు బహు పశుగ్రాస పథకం సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-వేపాడ: పాడి రైతులకు ప్రభుత్వం బహు పశుగ్రాసాల సాగుకు ఉపాధి హామీ నిధులు ద్వారా పశుగ్రాసంకు నిధులు మంజూరు చేస్తుందని, వాటిని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని బొద్దాం పశు వైద్యాధికారి ఎం. సునీల్ కుమార్ అన్నారు. గురువారం బొద్దాం పశు వైద్య కేంద్రంలో కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ వ్యవసాయం చేసే రైతులు వ్యవసాయంతో పాటు పాడి పశువుల ద్వారా మరింత ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సదుద్యేశంతో ఈ పథకం ప్రవేశపెట్టింది అన్నారు.ఈ పథకంకు ఐదు ఎకరాల భూమి కలిగిన ఎస్సీ ఎస్టీ కుటుం బాలతో పాటు,చిన్న సన్నకారు రైతులు అర్హులన్నారు.అలాగే వ్యక్తిగతంగా కూడా రైతులు 10 సెంట్లు నుండి 50 సెంట్లు వరకు పశుగ్రాస సాగు వేసుకోవచ్చన్నారు.50 సెంట్లు వరకు సాగు చేసిన రైతుకు కూలీల వేతన ఖర్చు కింద రూ. 15000లు, మెటీరియల్ ఖర్చులు రూ.17.992లు. అలాగే 40 సెంట్లు విస్తీర్ణంకు, కూలీలకు మెటీరియల్ ఖర్చులు కలిపి రూ.26.394లు, 30 సెంట్లు విస్తీర్ణంకు కూలీలకు మెటీరి యల్ ఖర్చులు కలిపి రూ. 19.795లు, 20 సెంట్లు విస్తీర్ణం నకు కూలీలకు,మెటీరియల్ ఖర్చులు కలిపి రూ.13.197లు, 10 సెంట్లు విస్తీర్ణకు కూలీలు వేతనం, మెటీరియల్ ఖర్చులు కలిపి రూ.6.599లు ఇవ్వడం జరుగుతుందన్నారు. కావలసిన రైతులు దరఖాస్తు ఫారంతో జాబు కార్డు జిరాక్స్,పొలం వన్ బి పత్రం,ఆధార్ కార్డు, బ్యాంకు పాసు బుక్కు,రేషన్ కార్డు జిరాక్సును, ఈ అవకాశాన్ని పాడి రైతులు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మెప్మా పి.డి గా బాధ్యతలు స్వీకరించిన జి.వి.చిట్టిరాజు

విశాలాంధ్ర-విజయనగరం: మెప్మా పి.డి గా జి.వి.చిట్టిరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. మర్యాద పూర్వకంగా కలెక్టర్ ను ఛాంబర్ లో కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. చిట్టి రాజు శ్రీకాకుళం జిల్లా పలాస లో డి.ఎల్.డి.ఓ గా పని చేస్తూ బదిలీ పై జిల్లాకు వచ్చారు.

దబ్బిరాజు పేట మోడల్ పాఠశాలను వార్షిక తనిఖీ

ఎంఈఓ జగదీశ్వరరావు

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని దబ్బరాజుపేటలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(మోడల్ పాఠశాలను)మండల విద్యాశాఖ అధికారి జి.జగదీశ్వర రావు గురువారం వార్షిక తనిఖీ చేశారు.ఈ తనిఖీలో భాగంగా ఉదయం 8:30 గంటలకు పాఠశాలకు చేరుకొని పాఠశాలలో విద్యార్థులు చేసిన ప్రార్థన రాగయుక్తంగా లయబద్ధంగా దేశభక్తి స్నేహభావం పెంపొందే విధంగా ప్రార్థన చేయడంతో ఆకర్షియంగా ఉందని తెలియజేశారు. విద్యార్థుల సామర్థ్యాల పరిశీలనలో తెలుగు ఇంగ్లీష్ లెక్కలు చతుర్విధ ప్రక్రియలు పరిశీలించారు.వర్క్ బుక్స్ అకడమిక్ క్యాలెండరు ప్రకారంగా వర్క్ బుక్స్ విద్యార్థులు అన్ని తరగతులు పూర్తి చేశారు. అనంతరం ఉపాధ్యాయులకు రివ్యూ ఏర్పాటు చేసి పలు సలహాలు, సూచనలు ఇచ్చి సంతృప్తి వ్యక్తం చేశారు.

విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో నైపుణ్యం పెంపొందించాలి

ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

విశాలాంధ్ర-వేపాడ: ప్రస్తుతం విద్యా వ్యవస్థలో కంప్యూటరీకరణ పరిణీతి చెందుతున్న తరుణంలో విద్యార్థులకు విద్యతోపాటు క్రీడల్లో కూడా నైపుణ్యం పెంపొందించే దిశగా ఉపాధ్యాయులు తర్ఫీదునివ్వాలని విజయనగరం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. మండలంలోని సోంపురం గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ ని ఆయన గురువారం సందర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘు రాజు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల్లో కూడా నైపుణ్యం పెరిగేలా ఉపాధ్యాయులు శిక్షణ ఇవ్వాలని సూచించారు. సోంపురం జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు పలు క్రీడల్లో జిల్లా నుండి రాష్ట్రస్థాయి వరకు వెళ్లి క్రీడల్లో ఆడుతుండడం అభినందనీయమన్నారు. అలాగే విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని చదివిన పాఠశాలకు ఉపాధ్యాయులకు కన్న తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం విద్యార్థులతో కలిసి భోజనం చేసారు.అలాగే భోజనంలో నాణ్యత తగ్గితే తనకి పిర్యాదు చెయ్యాలని విద్యార్థులకి తెలిపారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయ సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, జొన్న పల్లి సత్తిబాబు రమణ పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.